క్లుప్తంగా

కంటి వెలుగు ప్రారంభం



కార్యక్రమంలో చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని 28వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పత్తిపాక పద్మ, మున్సిపల్ డీఈఈ ప్రసాద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బుగ్గ రాజేశ్వర తండాలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పిల్లి రేణుక శుక్రవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సర్పంచ్ ఆజ్మీర రజిత, వైద్యాధికారి స్రవంతి, రవినాయక్, పద్మ, మోహన్, రెడ్డినాయక్, రూప పాల్గొన్నారు.

నర్సుల దినోత్సవం



ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న నర్సులు

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ చేసిన సేవలను గుర్తు చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అత్యుత్తమ సేవలను అందించాలన్నారు. ఈ సందర్భంగా నర్సులకు చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు దీప్తి, అనిల్ కుమార్, సంతోష్‌చారి, వెంకటభరణి, రత్నమాల, ప్రణతిరెడ్డి, ప్రీతి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం కంచర్ల గ్రామంలో సహకార శాఖ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రానికి ధాన్యం తెచ్చిన వెంటనే తేమ శాతం పరిశీలించాలని, నిర్ణీత తేమ శాతం వచ్చిన వెంటనే కొనుగోళ్లు నిర్వహించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఆర్ఐ ప్రవీణ్, సహకార శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిర్మాణంలో జాప్యం

- పదేళ్లుగా పూర్తికాని స్త్రీశక్తి భవన నిర్మాణం
- మహిళా సంఘాల ఇబ్బందులు
- మండలంలో 813 స్వశక్తి సంఘాలు

బోయినపల్లి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయ పరిసరాల్లో నిర్మిస్తున్న స్త్రీశక్తి భవనం పనులు పదేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో భవనం పనుల శంకుస్థాపన చేపట్టగా, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా భవనం పనులు పూర్తికాకపోవడం గమనార్హం. నల్లరేగడి నేల కావడంతో పనులు ఆలస్యం అవుతున్నట్లు చెబుతున్నారు. మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయం పక్కకు 2012 మే 20న రూ.25 లక్షల అంచనాలతో మండల స్త్రీశక్తి భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. మొదట పనులు చేపట్టిన కంట్రాక్టర్ పిల్లర్లు, స్లాబ్ వరకు పనులు చేశారు. అనంతరం పనులు కొద్ది రోజులు నిలిచిపోయాయి. మరో ఇద్దరు కాంట్రాక్టర్లు మారినా పనులు పూర్తికాలేదు. స్త్రీశక్తి భవనంలో ఒక పెద్ద హాల్ నిర్మాణంతో పాటు మరో నాలుగు గదులు ఉన్నాయి.



బోయినపల్లిలో అసంపూర్తిగా ఉన్న స్త్రీశక్తి భవనం

813 స్వశక్తి సంఘాలు

మండలంలోని 23 గ్రామాల్లో 813 స్వశక్తి మహిళా సంఘాలు ఉన్నాయి. ఇందులో 9,373 మంది సభ్యులు ఉన్నారు. ప్రతీనెల మండల మహిళా సమాఖ్య సంఘం వారు నెలవారీ సమావేశాలు నిర్వహిస్తారు. సమావేశాలకు సమాఖ్య అధ్యక్షురాలు, కోశాధికారితో పాటు, ఐకేపీ ఏపీఎం, సీసీ, సీఏ, డీపీఎంలు హాజరవుతారు. మండల సమాఖ్య సమావేశాల్లో బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణాల పంపిణీపై చర్చిస్తారు. డీఆర్డీఏ చేపట్టే ప్రోగ్రాంల సమాచారం తెలియచేస్తారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల చెల్లింపు, రికవరీ తదితర అంశాలపై చర్చిస్తారు. స్త్రీశక్తి భవన నిర్మాణం పూర్తయితే పైకార్యకలాపాలు చేపట్టేందుకు సౌకర్యంగా ఉంటుంది.

ఇరుకుగా ఐకేపీ కార్యాలయం

మండల కేంద్రంలో ఉన్న ఐకేపీ కార్యాలయ భవనం చిన్నగా ఉండడంతో పాటు శిథిలావస్థలో ఉంది. ఈ క్రమంలో మండల స్త్రీశక్తి సంఘ భవనం నిర్మాణం పూర్తయితే ఐకేపీ అధికారులు, సిబ్బంది విధులకు సైతం వెసులుబాటుగా ఉంటుంది. అయితే పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు సరిగ్గా రాకపోవడం, పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాకపోవడంతో భవనం నిర్మాణ పనులు పూర్తికాకపోవడానికి కారణంగా చెబుతున్నారు. ఇదే సమయంలో ప్రతీనెల మండల మహిళా సమాఖ్య సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బందవుతోందని పలువురు మహిళలు తెలిపారు. భవన నిర్మాణం పూర్తయితే మహిళా సదస్సులతో పాటు, ఇతరత్రా మహిళలకు సంబంధించిన కార్యకలాపాలు నిర్వహించేందుకు వెసులుబాటుగా ఉంటుందంటున్నారు

నిర్మాణం పూర్తి చేయాలి



స్త్రీశక్తి భవనం నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలి. భవనం ఉంటే నెలవారీ సమావేశాలు నిర్వహించేందుకు సౌకర్యంగాగా ఉంటుంది. మహిళా సంఘాల మహిళలు మండల కేంద్రానికి వచ్చినప్పుడు సంఘ భవనానికి వచ్చి పలు విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

– మెరుపుల సంగీత, మహిళా సంఘ సభ్యురాలు

మహిళలకు చాలా ఇబ్బంది



మహిళా సంఘ సమావేశాలకు, ఇతరత్రా పనుల నిమిత్తం వచ్చిన మహిళలకు అందుబాటులో భవనం లేకపోవడంతో ఇబ్బంది కలుగుతోంది. భవన నిర్మాణం ప్రారంభించి ఏళ్లుగా గడుస్తున్నా ఇంకా పూర్తికాక పోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి.

– రమ్య, తడగొండ

నిర్మాణం పూర్తి చేస్తాం



స్త్రీశక్తి భవనం త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. భవనం నిర్మాణ పనులు ఎక్కువ శాతం పూర్తయ్యాయి. కేవలం విద్యుత్, బాత్రూం, వాష్‌రూమ్, కలరింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అవి కూడా త్వరగా చేపట్టాలని ఆదేశాలు ఇచ్చాం. త్వరలో భవనం నిర్మాణం పనులు పూర్తవుతాయని ఆశిస్తున్నాం.

– చంద్రయ్య, ఇన్‌చార్జి ఏపీఎం, ఐకేపీ

వీఓఏల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా



వీవోఏలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకిషన్



సమ్మెలో పాల్గొన్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఉమ

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- సమ్మెకు మద్దతు తెలిపిన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ

ఇల్లంతకుంట: వీవోఏల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళతామని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి శుక్రవారం వచ్చిన ఆయన కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న వీవోఏలను కలిసి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా వీఓఏలు కీలకపాత్ర పోషించారని, సీఎం కేసీఆర్ ఏనాడు చిన్నచూపు చూడబోరని, తప్పకుండా న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో మీర్జా, సర్పంచ్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కోనరావుపేట: గ్రామాల్లో సేవలందిస్తున్న వీవోఏల సమస్యలు పరిష్కరించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ డిమాండ్ చేశారు. కోనరావుపేట మండల కేంద్రంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు చేస్తున్న సమ్మెలో శుక్రవారం పాల్గొని మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు గోపాడి సురేందర్‌రావు, గొట్టె రామచంద్రం, మిర్యాల్‌కార్ బాలాజీ, మోహన్, సీపీఎం నాయకురాలు జవ్వాజి విమల పాల్గొన్నారు.



సమ్మెలో యువజన సంఘాల నాయకులు

చందుర్తి: ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మెలో వీవోఏల మండల అధ్యక్షురాలు స్వరూప, కార్యదర్శి వినోద కార్యక్రమంలో వీవోఏలు అజిదా, గంగ, మమత, పద్మ, రజిత పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న వీవోఏలకు మండల యువజన సంఘాల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి సంఘీభావం తెలిపారు

ఆడబిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి

- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు

వేములవాడఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆడ బిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందిస్తోందని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు అన్నారు. వేములవాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వేములవాడ, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ మండలాల్లోని 92 మంది ఆడ బిడ్డలకు రూ.92 లక్షల చెక్కులను శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 8,812 మంది పేదింటి ఆడబిడ్డలకు రూ.88 కోట్లు అందించామన్నారు. అలాగే 58 వేల మంది రైతులకు రైతుబంధు కింద సుమారుగా రూ.852 కోట్లు అందజేశామన్నారు. మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్యలు 90 శాతం పూర్తి చేశామని, మిగిలిన కొన్ని సమస్యలను కూడా త్వరలోనే పరిష్కారిస్తామన్నారు. ముంపు గ్రామాల త్యాగం వలనే 55 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీలు మ్యాకల రవి, యేష వాణి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ రేగులపాటి రవిచందర్‌రావు, తహసీల్దార్లు రాజు, నక్క శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీనివాసరావు, అజయ్ పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే

సమన్వయంతో అభివృద్ధి సాధ్యం

- ఎంపీపీ జనగామ శరత్‌రావు
- ముస్తాబాద్ మండల సర్వసభ్య సమావేశం

ముస్తాబాద్: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో మండలం ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. పలు శాఖలపై సమీక్ష జరిగింది.

➡ అంగన్‌వాడీ భవనాలకు రంగులు వేసేందుకు రూ.2 లక్షలు మంజూరయ్యాయని సూపర్‌వైజర్ అరవింద తెలిపారు. దీనికి స్పందించిన సర్పంచ్ గాండ్ల సుమతి మన ఊరు మన బడిలో చేసిన పనులకు ఇప్పటి వరకు బిల్లులు రాలేదని, ఆ పనులు మీరే చేసుకోవాలన్నారు.

➡ తెర్లుమద్దిలో రెండేళ్ల క్రితం చేసిన మిషన్ భగీరథ పనులను ఇప్పటి వరకు రికార్డు చేయలేదని, బిల్లులు రాలేదని సర్పంచ్ కిషన్‌రావు అన్నారు.

➡ గూడూరు అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.కోటి మంజూరు చేస్తే, రెండేళ్లకు పనులు మొదలు పెట్టారని, పంచాయతీ భవనాన్ని ఆలస్యంగా నిర్మిస్తున్నారని సర్పంచ్ రమేశ్ అన్నారు. దీనికి స్పందించిన ఎంపీపీ సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలన్నారు. గూడెంలో మురుగు నీరు రహదారిపైకి వస్తున్నాయని ఎంపీటీసీ శ్రీధర్ సభ దృష్టికి తీసుకువచ్చారు.

➡ మొర్రాపూర్‌లో రేషన్ దుకాణం లేక లబ్ధిదారులు నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్తున్నారని సర్పంచ్ దేవేందర్‌నాయక్ అన్నారు. సీపీఆర్ విధానంపై వైద్యాధికారి గీతాంజలి అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన సెస్ చైర్మన్ చిక్కాల రామారావును సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్ రావు మాట్లాడారు. ఎంపీడీవో రమాదేవి, ఇన్‌చార్జి తహసీల్దార్ సురేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

పోలీస్ బెటాలియన్ సిబ్బందికి వైద్య పరీక్షలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో వైద్య శిబిరాన్ని గురువారం కమాండెంట్ సుబ్రమణ్యం ప్రారంభించారు. మెడికవర్ హస్పిటల్స్ ఆధ్వర్యంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. బెటాలియన్ అధికారులకు, సిబ్బందికి సీపీఆర్ విధానం గురించి వివరించారు.

చలివేంద్రం ఏర్పాటు

సర్దాపూర్‌లోని పోలీస్ బెటాలియన్ ఆధ్వర్యంలో మెయిన్ గేట్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కమాండెంట్ సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. పట్టణానికి వచ్చే ప్రజల తాగునీటికి ఇబ్బంది పడకుండా పెట్టుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



సీపీఆర్ గురించి వివరిస్తున్న వైద్యులు

ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రారంభం

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ఎంపీపీ జనగామ శరత్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి జబ్బులతో బాధపడేవారు ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, సర్పంచ్ గాండ్ల సుమతి, వైద్యాధికారి గీతాంజలి, డాక్టర్ రాజారాం, నల్లనర్సయ్య, సంస్థ అధికారులు పాల్గొన్నారు.

పరామర్శ

బోయినపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన పొన్నం నారాయణ కుటుంబాన్ని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏనుగుల కనుకయ్య, ఏనుగుల ప్రశాంత్ ఉన్నారు.

సమాచారం

15న మండల సర్వసభ్య సమావేశం

వేములవాడఅర్బన్: వేములవాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బూర వజ్రమ్మ అధ్యక్షతన ఈ నెల 15న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అధ్యాత్మికం

పోచమ్మకు బోనాలు

వీర్నపల్లి: మండల కేంద్రంలో బీరప్ప–కామరాతి కల్యాణం సందర్భంగా యాదవ, కుర్మ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ, కురుమ సంఘ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శ్రీరేణుక ఎల్లమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 14 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు గోపూజ, గురుపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీపారాధన, గణపతి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెర పాక కొండయ్య, నాయకులు పాల్గొన్నారు.

జేపీఎస్ సోని మృతికి నివాళి



నివాళి అర్పిస్తున్న యూనియన్ నాయకులు

సిరిసిల్లటౌన్: వరంగల్ జిల్లా నర్సంపేటలో మృతిచెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోనికి స్థానిక అంబేద్కర్ చౌక్‌లో జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ప్రభుత్వ ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి తమకు న్యాయం జరుపాలని డిమాండ్ చేశారు. సోని చిత్రపటానికి జోహార్లు అర్పించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

వేములవాడ: మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం రాజన్న ఆలయ ఆవరణలోని వంద మంది పేదలకు అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బొప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

క్రీడాకారులకు పండ్లు పంపిణీ

చందుర్తి: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపు క్రీడల్లో భాగంగా వాలీబాల్ క్రీడాకారులకు మండల బీఎస్పీ నాయకులు శుక్రవారం పండ్లను పంపిణీ చేశారు.

సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలి

వేములవాడఅర్బన్/ఇల్లంతకుంట/బోయినపల్లి: అన్ని మండల కేంద్రాల్లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో మండల స్థాయి సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, ఎంపీడీవోలు శ్రీధర్, నల్లా రాజేందర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, లాంగ్‌జంప్, ఖోఖో, రన్నింగ్, షాట్‌పుట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు గ్రామ స్థాయిలో జట్టుగా ఏర్పడి పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. 15 నుంచి 36 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు పోటీల్లో పాల్గొనాలన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని రేపాక, సోమారంపేట గ్రామాల్లో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను ఏపీవో చంద్రయ్య శుక్రవారం పరిశీలించారు. జాబ్‌కార్డున్న ప్రతి ఒక్కరికి పని కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం హరిత నర్సరీలను పరిశీలించారు. జూన్ చివరి నాటికి మొక్కలను సిద్ధం చేయాలన్నారు.

నిబంధనలు గాలికి..

- మండుటెండలో ఉపాధిహామీ పనులు
- బేజారవుతున్న కూలీలు
- పత్తాలేని ఫస్ట్ ఏయిడ్ కిట్లు

వీర్నపల్లి: వలసల నివారించి, ఉన్న ఊరిలో ఉపాధి కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతోంది. పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన కనీస బాధ్యతను మరిచిపోతున్నారు. పని చేస్తున్న సమయంలో ఏదేని ప్రమాదం జరిగితే ప్రాథమిక చికిత్స అందించే ఫస్ట్ఎయిడ్ కిట్లు కూడా పత్తాలేవు. మండుటెండలున్న సమయంలో నీడనందించేందుకు టెంట్లు ఏర్పాటు చేయాలనే నిబంధనకు నీళ్లు వదిలారు. దీంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు.



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

సౌకర్యాల లేమి..

ఉపాధి హామీ పనులకు వయోజనుల నుంచి మహిళలు వెళ్తున్నారు. వీరికి పనిచేయాలని సూచించిన ఉపాధిహామీ పర్యవేక్షణ అధికారులు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. కనీస సౌకర్యాల లేమి మండలంలోని అన్ని గ్రామాల్లో అధికంగా కనిపిస్తుంది. సగటున 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో భానుడి తాపానికి కూలీలు బేజారవుతున్నారు. ఎండవేడిని తట్టుకోలేకపోతున్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు కంటికి కనిపించడం లేదు. గ్రూపుకు ఒకటి చొప్పున మేట్లకు గతంలో అందజేశారు. కానీ ఇప్పుడు వాటి అమలు కనిపించడం లేదు. గతంలో ఇచ్చిన వాటి వివరాలను అందుబాటులో లేకపోవడం విమర్శలకు తావిస్తున్నాయి. ఒక్కో గ్రూపునకు రెండు, మూడు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు వసతి అందించాల్సి ఉన్నా వాటి ఊసే లేదు. కూలీలు ఇంటి నుంచి నీళ్లు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

17 పంచాయతీలకు ఏడుగురే పర్యవేక్షకులు

మండలంలో 17 గ్రామపంచాయతీలుండగా ఆయా గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పనులను పర్యవేక్షించే ఫీల్డు అసిస్టెంట్లు ఏడుగురు మాత్రమే ఉన్నట్లు అధికారిక గణాంకాలున్నాయి. సౌకర్యాల అడిగితే తాము అన్ని గ్రామాలను పరిశీలించే పని ఒత్తిడి అధికంగా ఉందని వాపోతున్నారు.

పక్కగా పని లెక్కించేలా..

ఉపాధి హామీ పనులను తీరును పక్కగా లెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం కూలీలు పనిలో చేరిన వెంటనే సంబంధిత సాఫ్ట్‌వేర్‌తో కూడిన యాప్‌లో ఫొటోను అప్‌లోడ్ చేయాలి. పని ముగిసే చివరి నిమిషంలో మరో ఫొటోగ్రాఫ్ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇలా చేయడం వల్ల పని జరగడంతో కూలీల హాజరు లెక్కించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

వసతులు కల్పించాలి



ఉపాధి హామీ పనులు ప్రారంభమై పది రోజులు గడుస్తున్న సరైన వసతులు లేవు. దీనికి తోడు ఎండలు దంచికొడుతున్నాయి. ఎండదెబ్బ తగిలే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఆరోగ్యం దృష్ట్యా టెంట్లు, గ్లూకోజ్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలి.

– పర్మాల పర్శరాములు, కూలీ, వీర్నపల్లి

వసతులు కల్పిస్తాం



కూలీలకు సౌకర్యాలకు కల్పనకు అధికారులకు విన్నవించాం. ప్రతిరోజూ ఓ గంటపాటు వైద్య సేవల నిమిత్తం ఆశ వర్కర్ ఉంటున్నారు. ఓఆర్ఎస్, ఫస్ట్ ఏయిడ్ కిట్లు అందిస్తాం. టెంట్లు, నీళ్లు గ్రామపంచాయితీ నుంచి రావాల్సి ఉంటుంది. వీటిని పర్యవేక్షణ చేసి అందించేందుకు కృషి చేస్తాం.

– శ్రీహరి, ఏపీవో, వీర్నపల్లి